# పల్లెటూరి విద్యార్థి

తాత. కృష్ణమూర్తిగారు, బి.ఏ;యల్.టి.

"నిజంగా కంట్రీలైఫులో చాలా చమత్కారం వుంది. బెస్టు టొబాకో, బెస్టు గేదె పెరుగు, మాంచి ఘీ—అంచేత నేనోయ్, పోయట్సు, 'కంట్రీలైఫ్, కంట్రీలైఫ్' అని దేవులాడుతారు."

—కన్యాశుల్కము.

పల్లెటూరు కాపురం మొత్తంమీద చాలా యోగ్యంగా ఉంటుంది. పట్నవాసం అంటే, అది పైసాతో పని. మాత్మ్యంలో మోక్షం కావాలంటే మాత్రం అగ్రహారాలే శ్రేయస్కరం! రామాకృష్ణా అనుకుంటూ, నిర్విచారంగా కాలం గడపవచ్చును. భుక్తికి సరిపడే గింజలువచ్చే భూవసతి ఉండీ, చిన్నయిల్లు వాకిలి ఉన్నాయంటే, చొర్లంగివంటి అగ్రహారంలో స్వర్గవైభవంతో బ్రతకవచ్చును. బస్తీలలో ఉండే ధూళి, దుమ్ము, బళ్లు గిళ్లు, రోగాలు, పన్నులు—ఏబాధాలేకుండా, కలిగిన దానితో యింత గంజీ అన్నం అయినా శుభ్రంగా వండుకొని, తిని, పడుకోవచ్చును. మడితడి, దేవుడు దెయ్యం, మన చిత్తం వచ్చినట్లు జరుపుకోవచ్చును.

'చొర్లంగి' అగ్రహారం పర్లాకిమిడికి సుమారు పది పన్నెండు మైళ్లదూరంలో ఉంది. చాలా చిన్న గ్రామం. పదిపదిహేను బ్రాహ్మణకొంపలు తప్ప, అధికం లేవు. బ్రాహ్మణవీధి చాలా విశాలంగా, శుభ్రంగా ఉంటుంది; ప్రతీయింటికీ వీధిగుమ్మాలకు పెట్టిన ముగ్గులు 'చూడు చూడు' మని ఉంటాయి. ఆ వీధిచివరను ఒకపెద్ద రావిచెట్టు ఉంది. ఆచెట్టు నీడనే సాంబన్నగారి యిల్లు—అనగా మా స్కూలు. చెట్టు దాటగానే ఉత్తర దక్షిణంగా ప్రవహిస్తూ ఉన్న 'వంశధార' అనే యేరు ఉంది: మంచి ఆరోగ్యమైన జలం. రాళ్ళు, రప్పలు తినేసినా జీర్ణం చేయగల నీరు, నది చిన్నదైనా వరదరోజులలో గ్రామం ముంచివేస్తుందా అన్నంత భీకరంగా ఉంటుంది.

'ఈతకొట్ట నేర్చియుండుము' అని పెద్దలు చెప్పిన [illegible] నేను వృధా పోనియ్యలేదు. స్కూలు పిల్లలతో కూడి మాటికీ చీటికీ యేట్లో దుమికేవాడిని. శీఘ్రంలో యీత బాగా నేర్చుకున్నాను. కాని ఆ విద్యయొక్క ప్రయోజనం ఎన్నడూ నా అనుభవంలోకి రాలేదు. మీదుమిక్కిలి కొన్ని అనర్థాలు కూడా అప్పుడప్పుడు తటస్థించడం కద్దు. నదిలో యీదుతూ ఉన్నప్పుడు మావాళ్లెవరైనా నన్ను చూడడం తటస్థిస్తే, వెంటనే తాళాధ్యాయం తప్పేది కాదు. అదిగాక, వేళాపాళాలేక నీట్లో నానడం వలన అప్పుడప్పుడు జలుబుచేసి ఉష్ణం తగిలేది.

తొమ్మిది పదేళ్ల వాడి నయినదాకా నాకు చొర్లంగే నివాసస్థలం అయింది. చదువు, సంధ్య యేవిధంగా వెళ్ళిగాయో వేరే చెప్పనక్కరలేదు. సహవాసదోషం కూడా తగలకపోలేదు. తోడిపిల్లకాయలతో కూడి నేనుకూడా కొన్నికొన్ని వికారవిద్యలు నేర్చుకున్నాను. కోతిపిల్లి కర్ర, గోణేబిళ్ల, గొట్టికాయలు, బొంగరాలు, డూడూ, మొదలైన ఆటలలో గొప్ప ప్రవీణత సంపాదించాను. నీట్లో యీదడం, చెట్లుచామలు అసలీలగా యెక్కడం, యీడువాళ్లతో తగవులాడి ముష్టియుద్ధం చెయ్యడం, సమయం చిక్కినప్పుడెల్లా బరి యెగవెయ్యడం, తోటలలో దూరి పళ్లు, కాయలు దొంగిలించడం, ఎక్కడికి వెళ్లినా కుక్కజట్టీలు తెస్తూఉండడం—ఇవన్నీ బాగా అలవడ్డాయి. పల్లెటూరిగాలి బాగా తగిలింది. పెంకితనం పూర్తిగా అబ్బింది. "సంగతి బాగులేదు. ఇక యీఊళ్లోఉంటే కుర్రవాడు చెడిపోతాడు." అన్న భయం పట్టుకుంది మానాన్నకు.

వెంటనే నన్ను పర్లాకిమిడి తీసుకొపోయినాడు. అక్కడ మాదగ్గిరబంధువులే ఉంటే, వాళ్ళయింట

నన్ను అప్పజెప్పి, గుడ్డగుడును కుట్టించి, కొంతడబ్బు నాచేతికిచ్చి, "నాయనా, బుద్ధిగా చదువుకో" అని నాకేవో ఉపదేశాలుచేసి, పరశురామస్కూలులో నన్ను ప్రవేశపెట్టినాడు.

పట్నవాసానికి వచ్చానుకదా అని మొట్టమొదట కొంచెం గర్రాగా ఉండేది నాకు. కాని స్కూలుకు నాలుగురోజులు వరసగా వెళ్ళడంతోనే క్రమంగా పర్లాకిమిడి మీద అదొక అయిష్టత అంకురించింది. చోర్లంగిలో అనుభవించిన స్వేచ్ఛ జ్ఞాపకం వచ్చినప్పుడు, బడీగిడీ విడిచి యెక్కడికైనా పారిపోదామా అన్న దుర్బుద్ధి పుడుతూ ఉండేది. అయితే అంత తెగింపుపని చెయ్యడానికి ధైర్యం చాలకపోయింది. ఏమాత్రం అవకాశం దొరికినా స్కూలుకు వెళ్ళడం యెగవేసేవాడిని.

పరశురామస్కూలు ఆరోజులలో చాలా పేరు పడిన బడి. నాకు మాత్రం ఆస్కూలుకు పోవడం అంటే, పులిబోనులోకి వెళ్ళినట్లు ఉండేది. ప్రప్రథమంనుండీ నాకు పాఠశాలంటే అయిష్టత, బెంగ, భయమున్నూ! అందుకు తోడు బడిలో మాస్టర్లు సాంబన్నవంటి వాళ్లయితే, నాఘోష చెప్పేదేమిటి?

పరీక్షచేసి నన్ను మూడవతరగతిలో చేర్చుకున్నారు. అదే నాకు పెద్ద బి.ఏ. క్లాసువలె ఉండేది. ఏబీసీడీలు నేర్చుకోవడంతోనే, ఇంగ్లీషుయావత్తూ సాధించగలిగాననే అప్పుడు నాభావం! క్రమంగా చిన్నచిన్న యింగ్లీషు పేర్లు చెప్పడం ప్రారంభించారు. ఆ వెధవపేర్లు నాకు తిన్నగా వచ్చేవికావు. అచ్చులో ఒకమోస్తరు, వ్రాతలో యింకొకమోస్తరు, ఉచ్చారణలో మరొకమోస్తరు—ఏంభాష! ఒకదారి, ఒక తెన్ను ఉంటేనా? సులభంగా ఇంగ్లీషు నేర్చుకోలేకపోతే, లోపం నాలో ఉన్నదా, భాషలోనా? మాస్టర్ల అభిప్రాయంలో లోపమంతా విద్యార్థులదే! ఎంతో శ్రమపడి ఆ యింగ్లీషు పేర్లన్నీ నేర్చుకునేవాడిని; కాని జ్ఞాపకం ఉండేవికావు. జ్ఞాపకం లేదంటే అయ్యవారు ఊరుకుంటాడా? శిష్యులకు జ్ఞానం, జ్ఞాపకశక్తి అభివృద్ధి చెయ్యడానికే కదా దేవుడు మాస్టర్లను సృజించినాడు! కాబట్టి వాళ్లకు పాపభయం అనేది ఉండదు. జీవహింసకూడునా అనే సందేహమే కలగదు. అదిగాక, దండం దశగుణం భవేత్, అన్నారు పెద్దలు! విద్యార్థులను ప్రయోజకులను చెయ్యడానికి ఉపాధ్యాయులు కనిపెట్టిన సూక్ష్మమార్గం బెత్తం! కనుక, వృత్తిధర్మాన్ని అనుసరించి కుర్రవాళ్లను శిక్షించడం వారికి విధికృతం. అజ్ఞానం, బుద్ధిమాంద్యం, జ్ఞాపకలేమి, మొదలైనవి శరీరసంబంధమైన వ్యాసులవంటివేనని వారి అభిప్రాయం. వాటిని కుదర్చడానికి పేపబెత్తు తప్ప యితర మందులు లేవని కూడా ఒక గట్టి నమ్మకం!

ఆదిని యీదివ్యౌషధం కనిపెట్టిన ధన్వంత్రి ఏ మహాపురుషుడో కదా!......సాలమన్ వంటి బుద్ధిమంతుడు కూడా, 'స్పేర్ ది రాడ్, ఎండ్ స్పాయిల్ ది చైల్డ్!' అన్నాడు. అనగా, 'బెత్తం విరిగే పర్యంతం కుర్రకుంకను చావదన్నవలసినదే; ఏమాత్రం దయతలచినా వాడు చెడిపోతాడు!' అని ఉపాధ్యాయులకు హెచ్చరిక. ఆమహానుభావుని ఉపదేశాన్ని పెడచెవిని పెట్టిన స్కూలుమాస్టరు నేటికికూడా భూలోకంలో ఒక్కడూ లేడు.

తక్కినవాటి విషయమై అతని అభిప్రాయం ఎట్లా ఉన్నా, ఇంగ్లీషు నేర్చుకునేందుకు నాకు జ్ఞాపకశక్తి బొత్తిగా చాలదని మామాస్టరు సిద్ధపరచుకున్నాడు. ఆరోగ్యం కుదర్చడానికి చింతామణివంటి దివ్యౌషధం పేపబెత్తే కనుక, అనునిత్యం ఆయన దయతలచి నాకింత మందు యిస్తూ ఉండేవాడు. సాధారణంగా మందులు కడుపులోకి పుచ్చుకున్న తరువాత కాని పనిచెయ్యవు. ఈమందు అట్లుకాక, శరీరంమీద ఏభాగంపైని ప్రయోగించినా, వెంటనే నెత్తికెక్కుతుంది. ఘాటైన ఔషధం కాబట్టి, మోతాదు చిన్నదైనా, ఆ ధనరుసు వెంటనే కళ్లవెంబడి నీళ్లురాక మానవు. రోజూ నాకీమందు సేవించడం తప్పేదికాదు. కాని రెట్టింపు మోతాదుల

సహితం గుణం కనబడలేదు. రుగ్మత కుదరకపోవడంచేత, మాస్టరుకు అంతకంతకూ నామీద కోపం హెచ్చింది.

ఒకనాడు స్కూలుకు వెళ్లడం చాలా ఆలస్యమైనందున మాస్టరు కోపగించి, బెంచిమీద నిలబెట్టి నన్ను, "ఏం పుల్లయ్యా! నిన్నకూడా ఐదునిమిషాలు లేటుగా వస్తివి. ఈవాళ అరగంట ఆలస్యం అయింది. కారణం ఏమిటి?" అని అడిగినాడు.

ముఖం వేలవేసి, వేళ్లు నులుపుకుంటూ ఊరుకున్నాను.

"ఏం?—అడిగిన ప్రశ్నకు జబాబుచెప్పక, ముంగిపోతులాగు ఊరుకుంటావేం? సరియైన సమాధానము చెప్పలేకపోతే పులుసులోకి యెముకలు లేకుండా తంతాను". అనిగర్జించాడు మాస్టరు,

ఇంకా మొండికత్తె ఊరుకుంటే తాళాధ్యాయం తప్పదనిగ్రహించి, ఉన్నది ఉన్నట్లుగా నిజమైన కారణం తెలియజేశాను.

".........'అత్తా' బరికి వేళకావచ్చింది; చద్ది అన్నంపెట్టవూ వేగం? అని అడిగితే ఆమె 'నాయనా' మడికట్టుకున్నాను చద్దికుండముట్టుకోను ఈవాళ వొదిననుపెట్టమను అని చెప్పింది. వొదిన చెరువునుంచి యింకా అప్పటికిరాలేదు. ఆమె రావడం కొంచెం ఆలస్యంఅయింది. వచ్చి, పొత్తిపంచ కట్టుకొని, నాకూ ఆమెకు చెరొక కంచంవేసింది. ఆవకాయ అటకమీద ఉండిపోయింది. మా అత్తయ్యకు నిచ్చెన ఎక్కేందుకు భయం. పొత్తిపంచమడిలో వొదిన ఆవకాయకుండ ముట్టుకోకూడదు. తరుచుగా నేనే అటకెక్కి ఆవకాయతీసేవాడిని, కాని యీవాళ చలిగావుండబట్టి ప్రొద్దున్న నేను స్నానం చెయ్యలేదు. 'పోనీ' అప్పడాలురెండు కాల్చితెస్తా ఆగు! అనిచెప్పి, వొదిన నీళ్లపొయ్యిదగ్గరికి వెళ్లింది. చప్పున రమ్మనిచెప్పి, నేను నా కంచందగ్గరే కూచున్నాను. ఆమె ఎంతసేపటికీ రాలేదు. అప్పుడు నేను కూడా పెరటిలోకి వెళ్లాను. వదిన అక్కడ లేదు. అప్పడాలు అలాగేఉన్నాయి పొయ్యివద్ద. ఇటూ అటూ చూసేసరికి, పందిట్లోకనిపించింది వొదిన. నన్ను చూసి ముసిముసిగానవ్వింది. 'బరికి ఆలస్యంఅయిపోతూఉంటే, అప్పడాలు కాల్చకుండా పందిట్లో నిల్చుని యేంజేస్తున్నావు?' అని కోపంగా అడిగేను. దొండకాయలు కోస్తూ నిల్చుందనుకున్నాను. 'చద్దన్నం నువ్వే పెట్టుకోవాలి; బయటఉన్నాను' అని మెల్లగా చెప్పింది.

ఒళ్ళుకడుక్కోకుండా నేను చద్దికుండ ముట్టుకోకూడదు. అప్పుడు పొత్తిపంచవిడిచి, గావంచా కట్టుకొని, డేగిసాలోవేడినీళ్ళు తోర్లించుకున్నాను. నీళ్ళు చాలవేడిగావుండబట్టి, చన్నీళ్ళు తోడవలసి వచ్చింది. బడితొందరలో గబగబనీళ్ళు తోడడానికి హడావిడిగా చాద నూతులోవేశాను. తాడుజారింది అత్తకూకలువెయ్యడం ప్రారంభించింది. చాదతియ్యడానికియింట్లోగాలంలేదు; పొడుగైన చాంతాడూ లేదు. అప్పుడు జంగంవీధి పరుగెత్తి గాలంతెచ్చాను, చాంతాడుకోసం అప్పలమ్మ కొట్టుకువెళితే తాళ్ళు లేవు అక్కడ. బజారుకువెళ్ళి తాడుకొనుక్కొచ్చాను కొంతసేపుతంటాలుపడి బాల్చీతీశాను.

చప్పుచప్పున నాలుగుచెంబులు నెత్తిమీద పోసుకొని, అటకమీద ఆవకాయతీసి, చద్దన్నంపెట్టుకొని తొందరతొందరగా తిన్నాను, వెంటనే బట్టలువేసుకొని, పుస్తకాలు తీసుకొని బయలుదేరాను. స్కూలుకు సగందూరందాకా వచ్చేసరికి కాపీలపుస్తకం మాట జ్ఞాపకంవచ్చింది. ఆ పుస్తకం మరచిపోతే మీరు కొడతారని భయంవేసింది. వెంటనే వెనక్కిమళ్ళి, తూరీగలాపరుగెత్తి యింటికివెళ్ళాను. ఆతొందరలో గడపలోనిల్చున్న మావొదినను చూడనేలేదు. ఆమెనుదాటుకొని లోపలికివెళుతూఉంటే 'ఆగు...ఆగు!' అన్నాది ఆమె. 'అంత చూసుకోకుండావెళతావేం? బట్టలుతడుపుకో; నన్ను తగిలావు' అన్నది. ఈదుకోమని పెరటితన్న తిరిగివెళ్ళి, నూతి

వద్దస్నానంచేసి, చాకింటిబట్టలు తీసితొడుక్కొని, సాధ్యమైనంత త్వరలో మళ్లీస్కూలుకు బయలుదేరాను. అందుచేత యింతఆలస్యం అయింది.”

నాకథవిని మా మాస్టరు నిర్ఘాంతపోయినాడు. ఏమనడానికి ఆయనకు తోచిందికాదు. నేను చెప్పిన సమాధానం నిజమా అబద్ధమా అని తనలోవితర్కించుకున్నాడు కాబోలు ఏం నిశ్చయించుకొన్నాడో కాని బెంచిమీద నిల్చున్న నన్ను కూచోమని సౌంజ్ఞ చేశాడు. దెబ్బలు తప్పినందుకు మనసులో సంతోషించుకుంటూ కూచున్నాను.

కాని నాడు నేను లేచినవేళ మంచిదికాదు. ఉదయంనుండీ అన్నీ అపసవ్యంగానే పరిణమించాయి. మాస్టరు ఇంగ్లీషుపాఠం ప్రారంభించాడు. ప్రశ్నలువేశాడు. క్లాసు అంతా ఒక్కలాగేఉంది. అందరూ తప్పుతున్నారు. మాస్టరుకి వెర్రికోపం వచ్చింది; అందర్నీ వరసపెట్టికొట్టడంప్రారంభించాడు. అతనివైఖరి చూసేసరికి నాకు మీదిప్రాణాలు మీదనే లేచిపోయినాయి. వొచ్చిన ముక్కలుకూడా చెప్పలేకపోయాను. తప్పినకొద్దీ, నన్నే ప్రశ్నలువేశాడు. నోట మాటరాలేదు నాకు. కొయ్యబొమ్మవలె నిల్చున్నాను. తీవ్రమైన కోపావేశంతో ఆయన, బెత్తం తీసుకొని నన్ను చావదన్నినాడు. ఆదెబ్బలకు ఒంటిమీద తట్లుతేరి, అక్కడక్కడవాచి, రక్తంగూడు కట్టింది.అయినా అతగాడికితృప్తితీరలేదు.శక్తిపూరా ఆచిపెట్టి ఒక్కలెంపకాయ కొట్టాడు. గూబగింగురుమన్నది. ఒక్కక్షణం కళ్ళు చీకట్లుక్రమ్మి ఒళ్ళుతెలియలేదు. పళ్ళంటరక్తం చిమ్మింది. లాగుతడిసింది.

అదిమొదలు నాకు చదువంటే ఉపద్రవమైన భీతావహం కలిగింది. ఈచదువుఏనాటికైనా తప్పుతుందా, అనిపించింది. ‘ఏమైతే అదికానీ’ అన్నమనోనిశ్చయం చేసుకొని, ఆపూటనుంచి పరశురామస్కూలుగుమ్మం మరిత్రొక్కలేదు.

ఆమర్నాడు కొంచెం జ్వరం తగిలింది. మొదట నేను లక్ష్యపెట్టలేదు. అఘత్యంపైని ఉష్ణం బలపడింది. వెంటనే మా నాన్నకు కబురువెళ్లింది. సమాచారం తెలిసిన ఉత్తరక్షణం బయలుదేరి బ్రాహ్మడు రొకాయెకిని పర్లాకిమిడి చేరుకున్నాడు. సంగతి కనుక్కొని, “నెధవచదువు! దీనికోసమని కుర్రవాణ్ణి చంపుకుంటామా ? చదువులేకపోతే పీడానాడా కూడాపాయెను! బ్రతికిఉండే, బలుసాకులు తిని జీవించవచ్చు” అని మా మాస్టరుమీద కొంతసేపు గాపాయించి. తక్షణం బండిమీద నన్ను చోర్లంగి తీసుకొపోయాడు.

విద్య నేర్పినవాడు గురుడనీ, హరుడనీ పెద్దపెద్ద కబుర్లుచెప్తారు మనవాళ్లు. వశిష్ఠమునినీ, బృహస్పతినీ ఉదాహరణక్రింద చూపిస్తూ, గురుభక్తివంటి ఉత్కృష్టధర్మం మరొకటిలేదని బోధిస్తారు పిల్లలకు. గురువులంటే దయాదాక్షిణ్యాలు లేక పసిపిల్లల్ని పశువును బాదినట్లు కొట్టే మూర్ఖులనీ, రాక్షసులనీ, ఉన్న నిజం ఎవరూ చెప్పరు. ఈ అయ్యవారులకు నిజంగా పుట్టుగతులు లేవనుకుంటా! గుడిలో పూజారిపనిచేస్తూ దేవుడిసొమ్ము అపహరిద్దామనుకున్నవాడికి మరుసటిజన్మలో కుక్క పుట్టుక వస్తుందని వ్రాసి ఉన్నదట భారతంలో. ఈ స్కూళ్లలో ఉపాధ్యాయగిరీమిషమీద పిల్లల్ని చావదన్నే ప్రముఖులకు ఏంపుట్టుక వస్తుందో ఏ పురాణంలోనూ ఎవడూ వ్రాయడు !

# సాగరము

యేళ్ళూరి నాగయ్యగారు

సర్వ కళ్యాణతమ గుణసాగరుండ
రమ్ము వేరమ్ము నెచ్చలీ రమ్మటంచు
స్వాగతము నిత్తువానాకు సంతసమున
దుష్టునంచును పోదువా దూరముగను?
స్వీయగుణ పరివర్తన భీతిదక్కి

పూర్ణవ్యతిరేకగుణ గణపూర్ణమైన
ఆపగా స్నేహమొనరించు అబ్ధియొక్క
కదిమిగూడయు కలుగదా కలుగనాకు
తావక స్నేహవిషయికా ధైర్యలవము.